పేదల ముంగిట ఖరీదైన వైద్యం

- జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యేలు రాపాక, కొండేటి

మలికిపురం: పేదల ముంంగిటకే ఖరీదైన వైద్యం ఉచితంగా ఉంచిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డి దేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మలికిపురం మండలం చింతల మోరిలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఖరీదైన వైద్యం అందించాలనేది చాలా గొప్ప ఆలోచన ఈ ప్రభుత్వానిదని అన్నారు. శిబిరంలో ఎమ్మెల్యే కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మెడికల్ టీం మెడికల్ క్యాంప్‌నకు వచ్చిన 408 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శాసనసభ్యుల చేతుల మీదుగా మందులు, ఆరోగ్య సురక్ష పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ రావు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని ఊడిమూడి-1 గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ అధ్యక్షత జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.సుబ్బరాజు, రియా ఉన్నీషాబేగం, వైద్య సిబ్బంది ఈశిబిరంలో 263 మందికి వైద్య సేవలు అందించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, నాయకులు సాధనాల రమేష్, అడ్డాల రవి, కడలి వెర్రియ్య, కొల్లు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు గ్రామ సచివాలయం-1 పరిధిలో శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడారు. వైద్యులతో కూడిన బృందం రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 500 మంది రోగులు శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. కంటి పరీక్షలు చేసిన పలువురికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎస్.బాలాజీ, ఎంపీటీసీ కొపనాతి పుష్పలత, దార్ల పెదబాబు, బండారు కాశీ, మట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.



చింతలమోరిలో ఆరోగ్య సురక్ష పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



ఊడిమూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం -3లో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును శుక్రవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో 2275 మందికి గాను 652 మంది రోగులను గుర్తించి టోకెన్‌లు ఇచ్చి మెడికల్ క్యాంపునకు తరలించామన్నారు. అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ కిట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కుడుపూడి సత్తిబాబు, నెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి అన్నారు. శుక్రవారం అయినవిల్లి మండలం మడుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 530 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటచార్య, సర్పంచ్ నిమ్మకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ పంపన వాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఆలమూరు: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. మండలంలోని చింతలూరులో శుక్రవారం ఏజీపీ నామాల శ్రీనివాసు, సర్పంచ్ మార్గని కరుణ, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 513 మందికి వైద్య సేవలను అందించాలని లక్ష్యం కాగా 529 మందికి వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సేవలందించారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కొత్తపేట: సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేస్తుందని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం మండలంలోని వానపల్లి-3 సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అముడా చైర్మన్ డేవిడ్‌రాజు ప్రారంభించగా వివిధ విభాగాలను ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

రావులపాలెం: ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఈతకోటలో సచివాలయం-1 పరిధిలోని చెరువుగట్టు వీధి, పంచాయతీ ట్యాంక్ వీధి, బోడపాటి వారివీధి, రాజుల వీధి, సత్తెమ్మ తల్లి గుడి ఏరియా, పంచాయతీ వీధి, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి వారి ఇంట్లో సీఎం జగన్ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు ఉంటే చెప్పాలని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేశామన్నారు. ఏ ప్రభుత్వంలో చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని జగ్గిరెడ్డి అన్నారు. మరోసారి సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఎంపీటీసీ వి.సుబ్బరాజు, సర్పంచులు అంబటి సుబ్బలక్ష్మి, కర్రి గోవిందకృష్ణారెడ్డి, బొక్కా కరుణాకరం, పొడగట్లపల్లి సత్రం చైర్మన్ కొపెల్ల మల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఈతకోటలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

పేదల సొంతింటి కల సాకారం

మామిడికుదురు: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక పేదల సొంతింటి కలను నెరవేర్చారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. కరవాకలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన 91 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించారు. సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు వారి సొంత గ్రామంలోనే అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందని ఎమ్మెల్యే వరప్రసాదరావు చెప్పారు. ప్రజలకు మెరుగైన వేద్య సేవలందించాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, గ్రామ శాఖ అధ్యక్షుడు సందాడి పార్థేశ్వరవర్మ, మాజీ సర్పంచ్ సిర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, సందాడి ఏసుబాబు, రేకాడి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



కరవాకలో పేదలకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుండ అన్నపూర్ణ

ఆత్రేయపురం: స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ నాతిబుజ్జి ఆధ్వర్యంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన విషయాలను అధికారులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని వాటిని ప్రజలందరికీ అందించే బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ ఉచిత వైద్యం అందుతోందని జెడ్పీటీసీ బోణం సాయిబాబు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఈసీజీ, ట్రూనాట్ లాంటి పరీక్షలు, కుక్క, పాము కాటుకు చికిత్స తదితర సేవలు అందుబాటులో ఉన్న విషయం హెల్త్ సిబ్బంది ద్వారా ప్రజలకు తెలియజేయాలని వెలిచేరు ఎంపీటీసీ వేములు వెంకటరమణ మెడికల్ అధికారులను కోరారు. ర్యాలి గ్రామంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకోవల్సిన ఎకరం భూమి సమస్యను పరిష్కరించాలని, బొబ్బర్లంక నుంచి వెలిచేరు ఆర్‌అండ్‌బీ రోడ్డు రిపేరు చేయాలని ఇలా పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగార్రాజు, కోఆప్షన్ సభ్యుడు పి.జయపాల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ఈతకోట గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్ గండ్రోతు పరమేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గండ్రోతు సత్య సూర్యనారాయణ (రాజు) సోదరులు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి

పి.గన్నవరం: దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ అన్నారు. మండలంలోని వాడ్రేవుపల్లి శివారు సిర్రావారిపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఉప్పాటి రాజేష్, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సిర్రా మాధవ్, చుట్టుగుల్ల సత్యనారాయణ, ఉండ్రాజవరపు సురేష్, తెన్నేటి వెంకటేశ్వరరావు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అంబాజీపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే కె.చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వి.చినబాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి దాని ముఖ్యఉద్దేశం వలంటీర్లకు, జేసీఎస్ కన్వీనర్‌లకు, గృహసారథులకు, సచివాలయ కన్వీనర్‌లకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నా రు. దేశంలోనే పారదర్శక పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ కమిటీ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వి.వెంకట్రాజు, ఎస్.నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పీకే రావు, వైస్ ఎంపీపీ ఎస్. నాగరాజు, ఎం ఎం శెట్టి, మైలా ఆనందరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



పి.గన్నవరంలో జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, ఆటో డ్రైవర్లు

పి.గన్నవరం: వాహనమిత్ర పథకంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి డ్రైవర్లకు ఏటా రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతగా శుక్రవారం స్థానిక అక్విడెక్టు నుంచి సెంటర్ వరకూ శ్రీలక్ష్మీ గణపతి, శ్రీసిద్ధి వినాయక ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, పార్టీ రాష్ట్ర నాయకులు ఏవీ సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహారావు, నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలనతో ప్రజల మదిలో సుస్థిరస్థానం

రాజోలు: సుపరిపాలనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మదిలో సుస్థిర స్థానం పొందారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం పొన్నమండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే రాపాక వివరించారు. గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాపాకకు మహిళలను హారతులిచ్చారు. స్థానిక పార్టీ నాయకులు ఆయనను పుష్పకిరీటం, గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆయననే సీఎంగా విజయపథంలో నిలపాలని కోరారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. మాజీ ఎంపీపీ చేకూరి శింగరాజు, సర్పంచ్ కుక్కల బేబికుమారి, సొసైటీ చైర్మన్ కడలి సత్యనారాయణ, నాయకులు చిట్టూరి వేణు, చేకూరి చంటిరాజు, గెడ్డం బుల్లిబ్బాయి, చెల్లింగి రాజబాబు, స్టాలిన్, గుబ్బల సత్తిబాబు, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో క్రీడా ఖ్యాతిని చాటాలి

కొత్తపేట: వివిధ క్రీడల్లో ప్రతిభ చాటడం ద్వారా జాతీయ స్థాయిలో కొత్తపేట మండల క్రీడా ఖ్యాతిని చాటాలని పూర్వ జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు చీకట్ల రామారావు క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు కె.పూర్ణ, ఎం.లిఖితాదేవి నంద్యాల జిల్లా మహానందిలో జరిగిన అంతర్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని జిల్లాను తృతీయ స్థానంలో నిలిపారు. శుక్రవారం సాయంత్రం ఆ విజేతల అభినందన, జగనన్న స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వై.చంద్రశేఖరం అధ్యక్షత జరిగిన సభలో చీకట్ల మాట్లాడుతూ ఒకప్పుడు వివిధ క్రీడలకు, క్రీడాకారులకు కొత్తపేట పెట్టింది పేరన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభను చాటిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

మామిడికుదురు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ రాజీ లేని పోరాటం చేస్తుందని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ మాజీ అధ్యక్షుడు కేవీ శేఖర్ పేర్కొన్నారు. మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఎస్టీయూ సభ్యత్వాలను నమోదు చేయించారు. మామిడికుదురులో జరిగిన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన పీఆర్సీ బకాయిల విడుదల, జీపీఎస్ విధానం, నాడు-నేడు నిధుల బకాయిలు, పీజీటీ తదితర సమస్యలపై చర్చించారు. ఉపాధ్యాయులకు సేవలందించడంలో ఎస్టీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల వీరరాఘవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రతినిధులు పాల్గొన్నారు.


లెక్క తేలేదెప్పుడు?

- భూముల వేలం సొమ్ము మాయం
- పట్టించుకోని యంత్రాంగం

ఆత్రేయపురం: ఏళ్లు గడుస్తున్నా .. మండలంలోని కట్టుంగ ఆంజనేయ స్వామి ఆలయ భూముల సమస్యకు మోక్షం కలగడం లేదు. వేలం పాట ద్వారా వచ్చిన రూ.6.91 లక్షల ఆదాయానికి లెక్క చెప్పలేదు. ఈ మొత్తం అటు ప్రభుత్వానికి చేరలేదు. ఇటు ఆలయ ఖాతాలోకి చేరలేదు. అధికారుల కుమ్మక్కై సాక్షాత్తూ ఆంజనేయ స్వామి సొమ్మును స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజాలు నిగ్గు తేల్చేందుకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి..

కట్టుంగ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన, అన్యాక్రాంతమైన 26.46 సెంట్ల భూమిని గుర్తించడంలో విచారణ కమిటీ మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2015లో అప్పనపల్లి ఆలయ ఈఓ, కట్టుంగ ఆలయ ప్రత్యేకాధికారి వీవీవీఎస్ఎన్ మూర్తి ఆలయ భూములను గుర్తించి కౌలు వేలం పాట నిర్వహించారు. అప్పటి దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ భ్రమరాంబ ఆదేశాల మేరకు ఆమె సమక్షంలోనే ఈ వేలం జరిగింది. అప్పట్లో 18.05 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ 6.91 లక్షల కౌలు బకాయిలు వసూలయ్యాయి. వాస్తవంగా వచ్చిన కౌలు ఆదాయాన్ని దేవదాయ శాఖ బ్యాంకు ఖాతాకు జమ చేయాలి. అయితే అధికారులు తమ సొంత అవసరాలకు వినియోగించుకుని కేవలం రూ.1.15 లక్షలు మాత్రమే దేవదాయ శాఖకు జమ చేశారు. ఇటీవల ఆలయ భూములను గుర్తించమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ ఆదేశాల మేరకు విచారణ కమిటీని కూడా నియమించారు. దాదాపు సుమారు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఆ కమిటీ పట్టించుకున్న దాఖలాలు లేవని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి అప్పనపల్లి ఈఓ, కట్టుంగ ఆలయ ప్రత్యేకాధికారి వీవీవీఎస్ఎన్ మూర్తి ఆ నిధులను ఏం చేశారనే లెక్క తెలియలేదు. ప్రస్తుత ఈఓ బి.కృష్ణ చైతన్యను ప్రశ్నిస్తే తమకు అప్పట్లో విధులు నిర్వహించిన ఈఓ మూర్తి కేవలం రూ.1.15 లక్షలు మాత్రమే అప్పగించారన్నారు. అలాగే కట్టుంగ ఆంజనేయస్వామి ఆలయానికి అప్పట్లో దాతలు లొల్ల, కట్టుంగ, అంకంపాలెం, వసంతవాడ గ్రామాల్లో 18.05 ఎకరాల భూమిని సమకూర్చారన్నది ఈ ప్రాంత వాసులకు తెలిసిన విషయమే. అన్యాక్రాంతమైన ఆలయ భూములపై ఇప్పటికే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్టు ప్రస్తుత ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. 2015లో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు 18.05 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించారన్నారు. ఇటీవల ఆలయ భూములను గుర్తించమంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విచారణ కమిటీని నియమించినట్లు తెలిపారు. అలాగే నోటీసులు జారీ చేశామన్నారు. త్వరలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు.



కట్టుంగ ఆంజనేయస్వామి

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా వర్తింపు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికరలో ఇటీవల చెరువులో వేటాడుతూ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందిన చొప్పల యాకోబు (53) కుటుంబానికి సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా వర్తింప చేశారు. ఇందుకు సంబంధించి తక్షణ సాయంగా రూ.10 వేలు కుటుంబానికి అందజేసినట్టు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వై.శిరీష శుక్రవారం తెలిపారు. యాక్సిడెంటల్ డెత్‌కు గాను రూ.5 లక్షలు కుటుంబానికి లబ్ధి చేకూరనున్నట్టు, తక్షణ సాయంగా రూ.10 వేలు ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ పంపిణీలో ఎంపీటీసీ చొప్పల బాబూరావు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

మామిడికుదురు: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు పేర్కొన్నారు. లూటుకుర్రులో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న కొబ్బరి చెట్ల పళ్లాల పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్రతి రైతు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఆటో బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి పాక్షిక గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మండపేట నుంచి రావులపాలెం వెళుతున్న ఆటో జొన్నాడ మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు పాక్షిక గాయాలయ్యాయి. ఫ్లై ఓవర్ పనుల్లో నిర్లక్ష్యత వల్లే ఈ ప్రమాదాలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మృతదేహం లభ్యం

రావులపాలెం: మండలంలోని ఊబలంక గోదావరి గట్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, కుళ్లిన స్థితిలో ఉండటంతో గ్రామ వీఆర్వో ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా వివరాలు నమోదు చేసుకుని చుట్టుపక్కల విచారించామన్నారు. ఎటువంటి సమాచారం లభించలేదన్నారు. దీంతో మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్టు ఎస్సై తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరైనా మిస్సింగ్ అయి ఉంటే స్థానిక రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. అలాగే ఎస్సై ఫోన్ నంబర్‌కు 9440796567 సమాచారం ఇవ్వాలని కోరారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

మలికిపురం: మండలంలో గూడపల్లిలో 2018లో జరిగిన దాడిలో ఇద్దరికి రెండు నెలల జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ రాజోలు ఏజేఎఫ్‌సీ కోర్టు జడ్జి కె.హిమబిందు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే బాకీ విషయమై రాజోలు మండలం చింతలపల్లికి చెందిన ఇంటిపల్లి సత్యనారాయణ మలికిపురం మండలం తూర్పుపాలేనికి చెందిన వీరా కృష్ణ, వీరా సాయిలను గూడపల్లిలో అడిగాడు. ఆగ్రహించిన కృష్ణ, సాయిలు సత్యనారాయణపై దాడి చేశారు. దీనిపై అప్పటి ఎస్సై చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులు ముద్దాయిలో వీరా కృష్ణ, వీరా సాయిలకు రెండు నెలల జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు మలికిపురం ఎస్సై జి.సురేంద్ర శుక్రవారం తెలిపారు. ఈ కేసులో పీపీగా నల్లి ఆనంద్, కోర్టు కానిస్టేబుల్‌గా హసన్ వ్యవహరించారు.

క్లుప్తంగా

నేడు మండలంలో మంత్రి పర్యటన

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర దేవదాయ-ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శనివారం ఉదయం దర్శించుకుంటారని మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు. అనంతరం వాడపల్లిలో ఆర్బీకే, అలాగే లొల్లలో సచివాలయ భవనం ప్రారంభంలో పాల్గొంటారన్నారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సాయంత్రం లొల్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కనుమూరి పిలుపునిచ్చారు.

నిత్యాన్నదాన భవనానికి రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవనానికి ఇంద్రపాలేనికి చెందిన బూడి తులసి రూ.50,116 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

ఉచితంగా కాయగూరల విత్తనాల పంపిణీ

మలికిపురం: మండలంలోని విశ్వశరాయపురంలో వివేకానంద కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో సుమారు 200 మందికి 'మానవతా మూర్తులు' గ్రూపు ఆధ్వర్యంలో కాయగూరల విత్తనాలు ఉచితంగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యుడైన కొండూరి శేషు (తాడేపల్లిగూడెం, అమెరికా) పాల్గొని మానవతా మూర్తులు గ్రూపు ద్వారా విభిన్నమైన పంథాలో సేవా కార్యక్రమాలు నడుస్తున్నాయని కొనియాడారు. భవిష్యత్తులో తాను తమ సన్నిహితుల సహకారాన్ని మానవతా మూర్తులు గ్రూపుకు అందిస్తామని తెలిపారు.

కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలోని రెండు సచివాలయాల పరిధిలోని గృహ సారథులకు శుక్రవారం ఉచిత బీమా నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు నాగాబత్తుల యువరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, జేసీఎస్ దొమ్మేటి దుర్గారావు, ఎంపీటీసీ దాసరి మౌనిక, కన్వీనర్లు కుడుపూడి రాము, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, కడలి వెంకటరమణ, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, తోలేటి బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో సస్యరక్షణ

రాజోలు: మిత్ర పురుగులతో పంటలను పలు తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చని వ్యవసాయశాఖ డీఆర్‌సీ డీడీఏ జ్యోతిర్మయి రైతులకు వివరించారు. కూనవరంలో శుక్రవారం రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మిత్ర పురుగులు, శత్రు పురుగులను గుర్తించే విధానాలపై అవగాహన కల్పించారు. పంట పొలాల గట్లు చుట్టూ కంది, బంతి మొక్కలను నాటాలన్నారు. వీటి వలన మిత్ర పురుగులు చేరే అవకాశం ఉంటుందన్నారు. డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్, ఏడీఏ రామ్మోహన్, డీఆర్‌సీ ఏఓ మనోహర్, రాజోలు ఏఓ వై.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా పాలూరి

పి.గన్నవరం: స్థానిక ఎంపీపీ అంబటి భూలక్ష్మి (టీడీపీ) తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో తాత్కాలిక ఎంపీపీగా నియమితులైన మండల ఉపాధ్యక్షుడు పాలూరి వీరభద్రరావు (జనసేన) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు. గతంలో మండల పరిషత్ ఎన్నికల సందర్భంగా టీడీపీ, జనసేన పార్టీలకు మెజార్టీ ఎంపీటీసీ స్థానాలు రావడంతో.. ఎంపీపీ పదవిని రెండేళ్లు టీడీపీ, మూడేళ్లు జనసేన పార్టీలకు చెందిన వారు చేపట్టేందుకు ఒప్పందం జరిగింది. రెండేళ్ల పాటు ఎంపీపీగా పనిచేసిన అంబటి భూలక్ష్మి రాజీనామా చేయడంతో, ఆ పదవికి మళ్లీ ఎన్నిక నిర్వహించే వరకూ తాత్కాలిక ఎంపీపీగా పాలూరి కొనసాగుతారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యను బోధించాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యను బోధిస్తూ మచ్చిక చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. మాచవరం శివారు పోతాయిలంకలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్‌వీ మహాలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహారం వాటి విలువలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యతో పాటు పోషక విలువలున్న ఆహారంపై చిన్నారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం వాటి విశిష్టతను వివరించాలన్నారు. కార్యక్రమంలో కుడుపూడి సత్తిబాబు, నెల్లి సత్యనారాయణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల కొండలరావు, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.